### నేడు పాఠశాలలు బంద్

ఎదులాపురం, నవంబర్ 29 : రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకొని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ ఆరోపించారు . శుక్రవారం ఆదిలాబాద్లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ఎదుట ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ ఘటనల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాలు పీడీఎస్యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన పాఠశాలల బంద్ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ కోట్నాక్ సక్కు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ్, పీడీఎస్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయి, అశోక్, పీడీఎస్యూ జిల్లా సహాయ కార్యదర్శి దతాత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### మాస్ కాపీయింగ్కు పాల్పడవద్దు

భైంసా, నవంబర్ 29 : విద్యార్థులు ఎవరూ కూడా మాస్ కాపీయింగ్కు పాల్పడకుండా కష్టపడి చదివి పరీక్షలు రాయాలని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య అన్నారు. డిగ్రీ రెగ్యులర్ పరీక్షలలో కాపీకి పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను బుక్ చేసి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పరీక్షలు సొంతంగా రాసి ఉత్తీర్ణులై ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

### కడ్తాల్ పాఠశాలలో బాలసభ

సోన్, నవంబర్ 29 : కడ్తాల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో పరమేశ్వర్ హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక కళలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రమేశ్బాబు, విజయ వాణి, జ్యోతి, రాధ, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పాల ఉత్పత్తిని పెంచేందుకు దోహదం అజోలా

సోన్, నవంబర్ 29 : పాల ఉత్పత్తిని పెంచేందుకు అజోలా ఎంతగానో దోహదం చేస్తుందని డీఆర్డీవో విజయ లక్ష్మి అన్నారు. శుక్రవారం నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామంలో అజోలా (పశువులు తినే పదార్థం)ను మార్క్ ఔట్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గజానంద్రావు, ఏపీవో తుల రామకృష్ణ, సీసీలు పాల్గొన్నారు.

### ముగిసిన సప్తాహం

భైంసాటౌన్, నవంబర్ 29 : చుమందు గ్రామంలోని సిద్దేశ్వరాలయంలో శుక్రవారం సప్తాహం ముగిసింది. ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తాహ కార్యక్రమంలో మహిళలు, భక్తులు భజనలు, సంకీర్తనలతో పాటలు పాడారు. అనంతరం అన్నాదానం ఏర్పాటు చేశారు.

### పాఠశాలలు తనిఖీ చేసిన డీఈవో

నిర్మల్ అర్బన్, నవంబర్ 29 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో రామారావు అన్నారు. శుక్రవారం నిర్మల్లోని కురన్నపేట్ కాలనీలోని అర్బన్ పాఠశాల, సోమవార్పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులు నిర్వర్తించాలని సూచించారు. పాఠశాలలోని వంట గదిని, వంట సామగ్రి, వంట పాత్రలను పరిశీలించారు. ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఆయన వెంట ఏఎస్ఓ లింబాద్రి, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, ఎంఈవో నాగేశ్వర్ రావు, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బోథ్ : ఆదిలాబాద్కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

తాంసి నుంచి...

ఉట్నూర్రూరల్: దీక్షాదివస్లో పాల్గొన్న బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్

# దీక్షా దివస్కు తరలిన నాయకులు

బోథ్, నవంబర్ 29 : ఆదిలాబాద్లో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి బోథ్ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆధ్వర్యంలో వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, డాక్టర్ స్వామి, రాజు, ప్రవీణ్ ఉన్నారు.

### బీడు భూములు పచ్చగా మార్చిన ఘనత కేసీఆర్దే..

తాంసి, నవంబర్ 29: బీడు భూములను పచ్చగా మార్చిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్కు దక్కుతుందని బీఆర్ఎస్ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి మండల బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో నాయకులు వెంకట్ రెడ్డి, రజినీకాంత్ రెడ్డి,అశోక్, కార్యకర్తలు ఉన్నారు.

ఉట్నూర్ రూరల్, నవంబర్ 29: నిర్మల్లో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్, నిర్మల్ జిల్లా ఇన్చార్జి ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీక్షా దివస్ కార్యక్రమానికి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పెందూర్ పుష్పారాణి హాజరయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి రాష్ట్రం సాధించారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్, నవంబర్ 29 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన దీక్షా దివస్కు నార్నూర్, గాదిగూడ మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శుక్రవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సహకార సంఘం చైర్మన్ సురేశ్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్రావ్, మాజీ సర్పంచ్లు ఉర్వేత రూప్దేవ్, మడావి రూప్దేవ్, శ్రీరామ్, మడావి సాగర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాసీం, పట్టణాధ్యక్షుడు ఫిరోజ్ఖాన్, ఉపాధ్యక్షుడు రాథోడ్ శివాజీ, సీనియర్ నాయకులు కాంబ్లే ఉదయ్, రాథోడ్ సుభాష్, అలంఖాన్, సుల్తాన్ఖాన్, మసూద్ ఉన్నారు.

ఖానాపూర్, నవంబర్ 29 : నిర్మల్లో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ముందుగా పట్టణంలోని జగన్నాథ్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏండ్లు పూర్తయిన సందర్భంగా దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వెళ్లిన వారిలో నాయకులు రాజగంగన్న, గౌరికర్రాజు, ఖలీల్, సక్కారాం శ్రీను, రామునాయక్, నరేందర్రెడ్డి, చంద్రవాస్, సతీశ్, శేఖర్రెడ్డి, మనోజ్ ఉన్నారు.

ఖానాపూర్: దీక్షా దివస్కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### కేసీఆర్తోనే తెలంగాణ సాధ్యమైంది

దిలావర్పూర్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతోనే ఏర్పడిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏలాల చిన్నరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నాడు తెలంగాణ కోసం కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాల ఫలితంతోనే నేటి తెలంగాణ రాష్ట్రమని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్రావు, బీఆర్ఎస్ నర్సాపూర్(జీ) మండలాధ్యక్షుడు సుదర్శన్, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ఖాన్, మాజీ ఎంపీటీసీ చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజు, అరుణ్, గంగారెడ్డి, ఆనందం పాల్గొన్నారు.

నార్నూర్: ఆసిఫాబాద్కు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు



దిలావర్పూర్: దీక్షా దివస్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

### టీజీవో ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శికి సన్మానం

సన్మానిస్తున్న డీఎంహెచ్వో, వైద్యులు, హెచ్వన్ యూనియన్ సభ్యులు

ఎదులాపురం, నవంబర్ 29 : ఇటీవల టీజీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్ వామన్రావ్, సంయుక్తకార్యదర్శిగా కే అనిల్ ఎన్నికైన విషయం తెలిసిందే. శుక్రవారం ఆదిలాబాద్లోని డీఎంహెచ్వో ఛాంబర్లో హెచ్వన్ యూనియన్, డీఎంహెచ్వో రాథోడ్ నరేందర్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వైసీ శ్రీనివాస్, డాక్టర్ మెట్పెల్లివార్ శ్రీధర్, డాక్టర్ గజానంద్. సంఘం ముఖ్య సలహాదారుడు ఎస్ బ్రహ్మానంద రెడ్డి , కార్యాలయ పర్యవేక్షకులు గుజరాతి గోపి, హెచ్వన్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండారి కృష్ణ, రఘురాం, కార్యనిర్వాహక అధ్యక్షుడు రమణాచారి , ఉపాధ్యక్షుడు రవీందర్, సంఘం నాయకులు గంగాధర్, వెంకటరమణ, సచిన్, వివేక్, వెంకట్, రమేశ్, విజయ్ పాల్గొన్నారు

### రోడ్డు పనులు వేగవంతం చేయాలి

వాహనదారులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఇచ్చోడ, నవంబర్ 29 : రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ను నియంత్రిస్తూ వాహనదారులతో మాట్లాడారు. రోడ్డు పనులు పూర్తయ్యే వరకు ప్రజలు వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. రోడ్డు నిబంధనలు అందరూ పాటించాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడాపోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్

నిర్మల్ చైన్గేట్, నవంబర్ 29 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 27,28న నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీల్లో నిర్మల్కు చెందిన దివ్యాంగులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. షాట్పుట్లో కే ముకేశ్ ప్రథమ బహుమతి, చెస్లో పీ దేవు బాయ్ ప్రథమ, పీ ఆనంద్ ద్వితీయ, ట్రైసైకిల్లో జీ రాకేశ్ ప్రథమ, ఏ శ్రీవల్లి ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు దివ్యాంగుల డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అభినందించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారికి సన్మాన కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ ఆర్వో మధుసూదన్, పాల్గొన్నారు.

### ఫైర్ సెఫ్టీ నిబంధనలు పాటించాలి

భైంసా, నవంబర్, 29 : దవాఖానల యాజమాన్యాలు ఫైర్ సెఫ్టీ నిబంధనలు పాటించాలని భైంసా అగ్నిమాపక శాఖ ఇన్చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. భైంసాలోని ఓ ప్రైవేట్ దవాఖానలో అగ్ని ప్రమాదాలు నివారణ, తదితర అంశాలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 29: ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ అదికారులు, బీసీ సంక్షేమ, మహాత్మా జ్యోతిబా ఫూలే, వసతి గృహ ప్రిన్సిపాళ్లు, హెడ్ కుక్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, గోపిచంద్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నర్సాపూర్ (జి). నవంబర్ 29 : గొల్లమాడ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వ్యవసాయాధికారి రాంచందర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏఈవో గణేశ్, రైతులు ఉన్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎదులాపురం, నవంబర్ 29 : ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీజీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. టీజీవో అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం గ్రాడ్యుయేట్స్ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల (డీఏవో) సమక్షంలో శివకుమార్కు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి , ఏవోలు విశ్వామిత్ర, విశ్వనాథ్, రమణ, సతీశ్, శంకర్, శివచరణ్, ప్రణీత, కీర్తి, శివప్రసాద్ యోగిరాజ్, నరేశ్, ఉమర్, మహేశ్బాబు పాల్గొన్నారు

### రైతుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

కడెం, నవంబర్ 29 : రైతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ధర్మాజిపేట గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వాలు రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఈ తరుణంలో తాము రైతుల పక్షాన పోరాటాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 1న హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి 5వ వార్షికోత్సవ సదస్సుకు రైతులు పాల్గొనాలని కోరారు.

### జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయాలి

బోథ్, నవంబర్ 29: డిసెంబర్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మౌనిక కోరారు. శుక్రవారం బోథ్లోని కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్, సివిల్ బ్యాంకు కేసులు ఎక్కువ మొత్తంలో పరిష్కరమయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ఏపీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, రూపేందర్ సింగ్, హరీశ్, దమ్మాపాల్, విజయ్కుమార్, జమీర్, రాజు, బోథ్, ఇచ్చోడ, బజార్హత్నూర్ పోలీస్, బ్యాంకు అధికారులు, కోర్టు పీసీలు పాల్గొన్నారు.

### పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

ఎదులాపురం, నవంబర్ 29: వేసిన పంటకు దిగుబడి రాక, చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక మహారాష్ట్ర కేలాపూర్ తాలూకా చేనక కోర్టకు చెందిన రైతు అపథవర్ హన్మాండ్లు (29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు రిమ్స్కు తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. అపథవర్ హన్మాండ్లుకు పంట కోసం తీసుకున్న ప్రైవేట్ అప్పు రూ.6 లక్షలు, బ్యాంక్ అప్పు రూ.3 లక్షలు ఉన్నాయి. భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు.

### ప్యాలాలు తిని వృద్ధుడు మృతి

ఎదులాపురం, నవంబర్ 29 : ఎలుకలు చంపాడానికి పురుగుల మందు కలిపి ఉంచిన ప్యాలాలను తిని గుర్రోలే దత్తజీ (97) రిమ్స్లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్రావ్ తెలిపారు. యావత్మాల్ జిల్లా ఝరి తాలూకా ఫ్యూర్డోల్ గ్రామానికి చెందిన గుర్రోలే దత్తజీ ఇంట్లో ఎలుకల బెడద ఎక్కువ ఉండడంతో కుటుంబ సభ్యులు ప్యాలాలలో ఎలకల కోసం పురుగుల మందు కలిపి ఉంచారు. గమనించని ఆ వృద్ధుడు ఆ ప్యాలాలను తిన్నాడు. దీంతో అప్పటికి స్పృహకోలు పోయి పడిపోయాడు. సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్రావ్ తెలిపారు. కొడుకు ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు.

### విద్యార్థిని అప్పగింత

ఇచ్చోడ, నవంబర్ 29: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో గణితంలో మార్కులు తక్కువ వచ్చాయని గురువారం ఇంటి నుంచి వచ్చిన విద్యార్థికి స్నేహితుల ద్వారా తెలపడంతో మనస్థాపానికి గురై కళాశాల హాస్టల్ నుంచి వెళ్లి పోయింది. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యార్థిని జాడ తెలుసుకొని ఆమె కౌన్సెలింగ్ ఇచ్చి కళాశాల యాజమాన్యానికి శుక్రవారం అప్పగించడం జరిగిందని ఎస్ఐ తిరుపతి తెలిపారు.

### కారు బోల్తా: ఉపాధ్యాయుడికి గాయాలు

ఉట్నూర్ రూరల్, నవంబర్ 29 : నాగాపూర్ ఎక్స్రోడ్ వద్ద శుక్రవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో పులిమడుగు గ్రామానికి చెందన ఉపాధ్యాయుడు దినేశ్కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధ్యాయుడు దినేశ్ ఉట్నూర్ నుంచి పులిమడుగు గ్రామానికి వెళ్తున్న క్రమంలో నాగాపూర్ ఎక్స్రోడ్ వద్ద అదుపు తప్పి చెట్టుకు ఢీ కొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్ దవాఖానకు తరలించారు.

## 108 జంటలతో మహా దత్త యజ్ఞం

మహా యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

కుంటాల, నవంబర్ 29 : లింబా(బీ) గ్రామంలోని దత్తాత్రేయ మందిరంలో శుక్రవారం హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య పర్యవేక్షణలో 108 జంటలతో శ్రీ మహా దత్త యజ్ఞం నిర్వహించారు. అనంతరం అనుగ్రహభాషణ, మంగళ శాసనం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ అర్బన్, నవంబర్ 29 : వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం నిర్మల్లోని ఏఎస్రెడ్డి కాలనీలోని కల్ప హాజ్లో ఎల్పీజీ డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. మహిళలు పాల్గొని వివిధ రకాల తెలంగాణ వంటకాలను వండి స్టాల్స్లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ హాజరై వంటకాలను పరిశీలించారు. వంటలు వండేటపుడు మహిళలు, యువతులు అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, సీటీవో గోదావరి ఎల్పీజీ డీలర్లు సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

శోభాయాత్రలో భక్తజన సందోహం

కుభీర్, నవంబర్ 29 : కుభీర్లోని విఠలేశ్వరాలయంలో ఈ నెల22న ప్రారంభమైన సప్తాహ వేడుకలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. వేకువజామున ఆలయంలో కాకడహారతి, విఠల రుక్మిణీలకు అభిషేకం, ప్రత్యేకార్చన అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. జాతరలో భక్తుల రద్దీతో సందడిగా మారింది. భైంసా ఆర్డీనీ డిపో వారు జాతర సందర్భంగా ప్రత్యేక బస్సులు నడిపారు. కుభీర్ ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పెంటాజీ, యాదవ, మున్నూరు కాపు సంఘాల అధ్యక్షులు దత్తు, అరవింద్, గ్రామస్తులు, యువకులు పాల్గొని సేవలందించారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

పెంబి, నవంబర్ 29: గ్రామాల్లో సర్పంచ్లు చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు తొడసం శంభు డిమాండ్ చేశారు. నిర్మల్లోని ప్రైవేట్ దవాఖానాలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్ను శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సర్పంచ్లు తమ పదవీ కాలంలో ప్రభుత్వం ఆదేశించిన అభివృద్ధి పనులను అప్పులు చేసి పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో మాజీ సర్పంచ్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్డీలు కట్టలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సర్పంచ్ల పదవీ కాలం ముగిసి ఏడాది కావస్తున్న ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగడంతో ఇటీవల పెంబి సర్పంచ్ పూర్ణచందర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్ చైన్గేట్, నవంబర్ 29 : అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అధికారులను ఆదేశించారు. నిర్మల్లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో మాట్లాడుతూ జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 2 నుంచి 15 వరకు సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి మందులు, చికిత్స అందించి వ్యాధి నివారణకు వైద్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవో రవీందర్రెడ్డి, డీపీఎంవోలు, జిల్లాలోని వైద్యులు పాల్గొన్నారు.

## లెక్కల మాస్టార్గా మారిన కలెక్టర్

విద్యార్థులకు పాఠాలు చెబుతున్న అదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

తలమడుగు, నవంబర్ 29 : మండలంలో బరంపూర్ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలకు వచ్చిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా కాసేపు విద్యార్థులకు పాఠాలు బోధించి లెక్కల మాస్టారుగా మారారు. శుక్రవారం పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు లెక్కల పాఠాలు బోధించారు. వారితో లెక్కలు చేయించి, సందేహాలను నివృత్తి చేశారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ స్వయంగా శ్రీకారం చుట్టిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా కాలనుగత వ్యాధుల అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం, బరంపూర్ పాఠశాలలో కొనసాగుతున్న సమగ్ర సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఈవో ప్రణీత, డీఎంహెచ్వో నరేందర్, మలేరియా అధికారి శ్రీధర్, ఎంపీడీవో, ప్రధానోపాధ